## క్లుప్తంగా

### గొడుగులకు గిరాకీ



పిఠాపురంలో గొడుగులు అమ్ముతున్న వ్యాపారులు

పిఠాపురం: ఎండలు మండినా.. వాన కురిసినా అవసరమయ్యేది గొడుగు. ఒకరికి అది రక్షణ అయితే మరొకరికి అది జీవనాధారం. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో గొడుగుల అమ్మకాలు ఊపందుకున్నాయి. ఎక్కడ చూసినా రహదారుల వెంబడి గొడుగులు విక్రయించే వారు దర్శనమిస్తున్నారు. పలు రకాల మోడల్స్‌లో గొడుగులు ఉండటంతో వాటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన వ్యాపారులు ఎక్కువగా గొడుగులు అమ్ముతున్నారు. పిఠాపురం బైపాస్ రోడ్డులో రంగురంగుల గొడుగుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

### జగన్‌ను కలిసిన పార్టీ నేతలు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో నియోజకవర్గ పార్టీ నాయకులు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు బుధవారం కలిశారు. తాడేపల్లిలో జగన్ స్వగృహంలో పార్టీ సీనియర్ నాయకుడు ఎలిశెట్టి నరేష్ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ములసా శ్రీను, నవర సర్పంచ్ దమ్మాల లక్ష్మణరావు, ఆర్బీపట్నం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నల్లల నాగేంద్రబాబు, జి.రాగంపేట నాయకుడు సిరిపురపు వీరబాబు ఆయనను కలుసుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని నరేష్ ఈ సందర్భంగా తెలిపారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు న్యాయం చేయడానికి ప్రత్యేకంగా లీగల్‌సెల్ ఏర్పాటు చేసినట్టు చెప్పారన్నారు.

### విద్యార్థులను బోధనతో ఆకట్టుకోవాలి



వీకే రాయపురం పాఠశాలలో విద్యార్థులను ప్రశ్నిస్తున్న ఎంఈఓ

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ టీచర్లు ఉన్నందున విద్యా బోధన విద్యార్థులను ఆకట్టుకునేలా ఉండాలని ఎంఈఓ శివరామకృష్ణయ్య అన్నారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం మండలంలోని వీకే రాయపురం ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలోని మినరల్ వాటర్ ప్లాంట్‌తో పాటు, మరుగుదొడ్లు, పరిసరాలను, మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. పాఠశాల పరిధిలో ఎన్‌రోల్‌మెంట్ ర్యాలీలను నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లలు చదవడం, రాయడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి నెలా సిలబస్ పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. విద్యార్థులకు సంబంధించిన నోట్ పుస్తకాలు, వర్కు, టెస్టు బుక్స్‌ను ఎంఈఓ పరిశీలించారు. హెచ్‌ఎం టీవీవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సీనియర్ల సేవలను ఆదర్శంగా తీసుకోవాలి



వెంకటరమణ దంపతులను సత్కరిస్తున్న కమిషనర్ తదితరులు

సామర్లకోట: సీనియర్ ఉద్యోగుల సేవలను ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో అటెండర్‌గా పని చేసి, పదవీ విరమణ చేసిన రొట్టా వెంకటరమణ అభినందన వీడ్కోలు సభ బుధవారం రాత్రి జరిగింది. ముఖ్యఅతిథిగా కమిషనర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటరమణ దంపతులను మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గిడుతూరి శ్రీనివాసరావు, ఆంధ్ర మాల మహానాడు అధ్యక్షుడు లింగం శివకుమార్, కౌన్సిలర్ నేతల హరిబాబు, రొట్టా అప్పారావు, మున్సిపల్ మేనేజరు అచ్యుతరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు. ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఉండవిల్లి రామరాజు తదితరులు సత్కరించారు.

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

సామర్లకోట: మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఎలిశెట్టి రమేష్ అన్నారు. పార్టీ నాయకులు బుధవారం స్థానిక తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. నాటిన మొక్కలను సంరక్షించాలని ట్రాఫిక్ ఏఎస్సై రత్నం తెలిపారు.

# కోర్కెలు తీర్చే ఇలవేల్పు

- నేటి నుంచి పెద్దాపురం మరిడమ్మ జాతర
- ప్రసిద్ధిగాంచిన అమ్మవారి మహోత్సవాలు
- సుదూర ప్రాంతాల నుంచి హాజరుకానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయం



పట్టణంలో ఊరేగుతున్న మరిడమ్మ అమ్మవారి గరగ (ఫైల్)

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా ప్రసిద్ధి చెందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల ఐదు నుంచి అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఏటా 37 రోజుల పాటు నిర్వహించే జాతర మహోత్సవాల్లో భాగంగా నాలుగో తేదీన జాతర అనంతరం ఐదు నుంచి ఆగస్టు పది వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఏటా లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిత్యం ధూపదీప నైవేద్యాలు అందుకుంటున్న పురాతన చరిత్ర కలిగిన మరిడమ్మ, అమ్మవారి చారిత్రక విశేషాలివి.

**చింతపల్లి వారి ఆడపడుచుగా..**

ఆంధ్ర, తెలంగాణలోని దేవతాలయాల్లో పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి దేవస్థానం మహిమాన్వితమైనది. అమ్మవారు సామర్లకోట చింతపల్లి వారి ఆడపడుచు. ఇప్పటికీ ఆ వారసులే ఇక్కడ ట్రస్టీలుగా వ్యవహరిస్తున్నారు. వారి కుల దేవతగా పెద్దాపురం పట్టణంలో వెలసింది. ఏటా ఆషాఢ మాసంలో 37 రోజుల పాటు జాతరను జరపడం ఆనవాయితీగా వస్తోంది.

**పుర వీధుల్లో అమ్మవారి గరగ**

ఆషాఢ మాసంలో అమ్మవారి జాతరకు ప్రత్యేకత ఉంది. ఆమె గరగకు విశిష్ట పూజలు నిర్వహిస్తుంటారు. జాతర ఆరంభానికి ముందు నుంచి తొలి గరగను ఊరేగించడం ఆనవాయితీ. పుర వీధుల్లో డప్పు వాయిద్యాలతో అమ్మవారి గరగను ఊరేగిస్తుంటే, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. కోర్కెలు తీరిన భక్తులు ముడుపులు, మొక్కులు తీర్చుకునేందుకు వేల సంఖ్యలో అమ్మవారి దర్శనానికి గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడతారు.



మరిడమ్మ అమ్మవారు

**వారానికో వీధి సంబరం**

గ్రామ దేవతగా ఆరాధిస్తూ పెద్దాపురం పట్టణవాసులు అమ్మవారి వీధి సంబరాలను నిర్వహిస్తుంటారు. ఇందుకు లక్షల రూపాయలు వెచ్చిస్తుంటారు. ఈ ఏడాది వీధి సంబరాలను మరింత వైభవోపేతంగా నిర్వహించేందుకు ఆయా ఉత్సవ కమిటీలు సన్నాహాలు చేస్తున్నాయి.

**నేడే అమ్మవారి జాగరణ మహోత్సవం**

ఆషాఢ మాసం ఆరంభంలో నిర్వహించే మరిడమ్మ అమ్మవారి జాగరణ మహోత్సవంలో భాగంగా ఈ నెల నాలుగో తేదీ (గురువారం రాత్రి) జాతర ప్రారంభం కానుంది. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారులు, రాష్ట్ర మంత్రులతో పాటు, ఎంపీ, స్థానిక ఎమ్మెల్యే హాజరవుతారు. జాతరకు సంబంధించి ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు ఆధ్వర్యంలో ఆసాదుల, వేద పండితులతో అమ్మవారి జాతర ఉత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

### ఏర్పాట్లు పూర్తి చేశాం



కోరిన కోర్కెలు తీర్చే మరిడమ్మ అమ్మవారి కృపకు ప్రతి ఒక్కరూ పాత్రులు కావాలి. ఆషాఢ మాస ఉత్సవాల్లో భాగంగా అధిక సంఖ్యలో భక్తులు హాజరై, జాతరను విజయవంతం చేయాలి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– సీహెచ్ రామ్మోహనరావు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్, పెద్దాపురం

### బీమాను మెకానిక్‌లు వినియోగించుకోవాలి



కేక్ కట్ చేస్తున్న మోటార్ సైకిల్ మెకానిక్‌లు

సామర్లకోట: కార్మికుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెడ్ పోస్ట్‌మాస్టర్ అమ్మిరాజు అన్నారు. ప్రపంచ మెకానిక్ డేను శ్రీలక్ష్మీ గణపతి స్కూటర్ అండ్ మోటారు సైకిల్ రిపేరింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక టీటీడీ కల్యాణ మండపం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. మోటార్ సైకిల్ సృష్టికర్త గాట్లీబ్ డైమ్లర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ముఖ్యఅతిథి అమ్మిరాజు మాట్లాడుతూ ఏడాదికి రూ.549 చెల్లిస్తే రూ.10 లక్షలు, రూ.749 చెల్లిస్తే రూ.15 లక్షల ప్రమాద బీమా వర్తిసుందన్నారు. ప్రమాదం జరిగితే రూ.లక్షతో పాటు, పిల్లల చదువుకు రూ.లక్ష వరకు ఆర్థికసాయం అందుతుందని చెప్పారు. సంఘ కార్యదర్శి ఆల్లక సాంబశివ మాట్లాడుతూ యూనియన్ ఏర్పడి 21 ఏళ్లయినా ఇప్పటి వరకు సొంత భవనం లేకపోవడం విచారకరమన్నారు. స్థానిక సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు, పులిమేరులోని దివ్యాంగుల పాఠశాలలోని విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఎండీ హనీఫ్, ఉపాధ్యక్షుడు ఇందన రాము, ప్రతినిధులు తణుకు శ్రీను, నెల్లిపూడి శ్రీను, ఆంధ్ర నూకరాజు, జి.ప్రకాశరావు, పి.సత్యనారాయణ, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

### గడ్డి కోసుకునేందుకు వేలం

సామర్లకోట: రైల్వే భూముల్లో ఉన్న గడ్డిని కోసుకునేందుకు ఈ నెల 6న మధ్యాహ్నం మూడు గంటలకు పర్మనెంట్ వే కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రామసుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 సంవత్సరానికి పాట ఉంటుందని, పాటదారులు 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. కడియం–కేశవరం, కేశవరం–ద్వారపూడి, ద్వారపూడి యార్డు, అనపర్తి–బిక్కవోలు, బిక్కవోలు–పెదబ్రహ్మదేవం, పెదబ్రహ్మదేవం–మేడపాడు, మేడపాడు–సామర్లకోట మధ్యనున్న రైల్వే భూముల్లో గడ్డికి వేలం ఉంటుందని వివరించారు.

### ప్రైవేట్ బస్ సీజ్

కాకినాడ సిటీ: రోడ్డు టాక్స్, పర్మిట్ లేకుండా పిఠాపురం నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేట్ బస్సును రోడ్డు రవాణా శాఖాధికారులు బుధవారం రాత్రి సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తిప్పుతున్న బస్సుపై కేసు నమోదు చేశారు. పర్మిట్, రోడ్ టాక్స్ లేకుండా నడుపుతున్నట్టు నిర్ధారించిన అధికారులు రూ.2,88,500 జరిమానా విధించారు. సీజ్ చేసిన వాహనాన్ని కాకినాడ ఆర్టీసీ డిపోకు తరలించారు. వాహనాన్ని కత్తిపూడి ఎంవీఐ బి శ్రీనివాస్ తనిఖీ చేశారు.

### ప్రజలకు మెరుగైన సేవలందించాలి



రెవెన్యూ సిబ్బందితో సమీక్షిస్తున్న ఆర్డీఓ కిషోర్

కొత్తపల్లి: ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించాలని కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపించాలన్నారు. పంటల సీజన్ నేపథ్యంలో రైతాంగానికి అవసరమైన కౌలుదారు, సాగుహక్కు పత్రాలు తక్షణమే మంజురు చేయాలన్నారు. విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను తక్షణమే మంజురు చేయాలని సూచించారు. కార్యక్రయంలో తహసీల్దార్ సుందర్ రాజు, డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ, ఆర్ఐ పొన్నాలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను పరిష్కరించాలి

**అధికారుల తీరుపై ఎమ్మెల్యే రాజప్ప ఆగ్రహం**

సామర్లకోట: మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యల పరిష్కారానికి బాధ్యతతో పని చేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. బుధవారం జరిగిన స్థానిక మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంతో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత కార్యాలయ ఆవరణలో ఉన్న జాతీయ నాయకుల విగ్రహాలకు నివాళులర్పించారు. ఆయనను ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ ఎన్‌డీ శ్యామ్ సుందర్ సత్కరించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నిధులతో పని లేని సమస్యల పరిష్కారానికి అధికారులు తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వ నిధులు తెస్తామని చెప్పారు. పుస్తకాల పంపిణీకి పిలవలేదని ఎంఈఓ–2 పి.పుల్లయ్య, అసంపూర్తిగా భవన నిర్మాణాలు నిలిపివేయడంపై పంచాయతీ రాజ్ డీఈ భాస్కరరావుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వేట్లపాలెం గ్రామంలో అతిసారాపై అందరూ సకాలంలో పనిచేశారన్నారు. ఈ సందర్భంగా శాఖల వారీగా సమీక్షించారు. ఉపాధి హామీ పథకంలో ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని ఏపీఓ ప్రభాకరరావుకు సూచించారు. పేద ప్రజలు దరఖాస్తు చేసిన వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని ట్రాన్స్‌కో ఏఈ కృష్ణను ఆదేశించారు. గుర్రపు డెక్క తొలగింపు పనులు నాసిరకంగా ఉంటున్నాయని ఇరిగేషన్ అధికారి వరప్రసాద్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లోని డంపింగ్ యార్డుల్లో పెరిగిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి, సీజనల్ వ్యాధులు రాకుండా చూడాలని ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న డస్ట్ బిన్లను వెంటనే పంపిణీ చేయాలని ఈఓపీఆర్డీ కర్రి హరిరామకృష్ణారెడ్డికి సూచించారు. ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని జేఈ తోట మంగాదేవిని ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న ఐసీడీఎస్ భవనాలు పూర్తి చేయడానికి నిధులు తెస్తానని సీడీపీఓ ఉషకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అద్దె భవనంలో బీసీ హాస్టల్ ఉండటంపై వార్డెన్ వాణిపై అసహనం వ్యక్తం చేశారు. వేట్లపాలెంలో అతిసార నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ చూపిన డాక్టర్ శ్రీహిమవతిని ఎమ్మెల్యే అభినందించారు. రైతులకు ధాన్యం సొమ్ము అందేలా చూడాలని ఏఓ సత్యకు సూచించారు. హౌసింగ్‌లో పూర్తి చేసిన పనులకు హౌసింగ్ అధికారి ఎంబుక్‌లు పూర్తి చేయకపోవడంపై ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఎంబుక్ రికార్డు చేయకపోతే వారికి బిల్లులు ఎలా వస్తాయని ఎమ్మెల్యే ప్రశ్నించారు. గ్రామంలో శానిటేషన్ సక్రమంగా జరగడం లేదని వీకే రాయపురం ఎంపీటీసీ శివకోటి శివరామకృష్ణ, ఎలిశెట్టి భీమన్నదొర ఆరోపించారు. ఎంపీడీఓ శ్యామ్‌సుందర్, తహసీల్దార్ వై.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్యంపై ఈఓపీఆర్డీతో చర్చిస్తున్న ఎమ్మెల్యే రాజప్ప

# ఘనంగా క్రైస్తవ దినోత్సవం

సామర్లకోట: మండల పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం క్రైస్తవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏసు క్రీస్తు శిష్యుల్లో ఒకరైన తోమా భారతదేశానికి వచ్చి దేవుని సువార్తను ప్రకటించిన రోజును పురస్కరించుకుని క్రైస్తవులు భారతీయ క్రైస్తవ దినోత్సవంగా జరుపుతారు. దీనిలో భాగంగా రిక్షా కార్మికులకు దుప్పట్లు, భోజనం అందజేశారు. ఆస్పత్రిలో రోగులకు, గర్భిణులు, బాలింతలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సంఘ ప్రతినిధులు సాల్మన్‌రాజు, వి.జాన్, ఆర్ లాజరస్, ఎ.చంటి, విశ్వాసరావు, రాజు, టి.బ్లెసింగ్, జె.జయరాజు, వి.సామ్యేల్‌రాజు, డి.పాల్ సోనియా పాల్గొన్నారు.

**పెద్దాపురంలో..**

పెద్దాపురం: జాతీయ క్రైస్తవ దినోత్సవ వేడుకలను పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల పాస్టర్ల సంక్షేమ సంఘ అధ్యక్షుడు నంగిన శామ్యూల్ సుదీప్ ఆధ్వర్యంలో శాంతి సువార్త ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు జీవీ రత్నం, నవజీవన్‌రాజు, ఆనంద్, ప్రేమరాజు, బి.యేసేపు తదితరులు పాల్గొన్నారు. క్లాప్స్ సంస్థ ఆధ్వర్యంలో పెద్దాపురం రీజియన్ అధ్యక్షుడు లంక పురుషోత్తమ్ దాస్ ఆధ్వర్యంలో క్రైస్తవ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పట్టణంలో ర్యాలీతో పాటు, మన ఇల్లు, ఆదరణ ఆశ్రమంలో వృద్ధులకు భోజన ఏర్పాట్లు, సేవా కార్యక్రమాలు చేశారు.



సామర్లకోటలో రిక్షా కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

**విరవలో ఉపవాస ప్రార్థనలు**

పెద్దాపురం: ప్రపంచ శాంతి కోసం ఈ నెల 4, 5 తేదీల్లో పిఠాపురం మండలం విరవలో ఉపవాస ప్రార్థనలు నిర్వహించనున్నట్టు క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం వ్యవస్థాపకుడు నంగిన సత్యానందం తెలిపారు. బుధవారం ఆయన క్రిస్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్ (సీజీఎం) వ్యవస్థాపకుడు నంగిన శామ్యూల్ సుదీప్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ప్రపంచంలో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని దివిలి, చదలాడ, తిరుపతి, కాండ్రకోట, పిఠాపురం మండలం విరవలోని క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరాల్లో ఐదు నెలల పాటు ఉపవాస ప్రార్థనలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఇందులో భాగంగా ఈ నెల 4, 5 తేదీల్లో విరవలో ఉపవాస ప్రార్థనలు నిర్వహిస్తామని చెప్పారు.




పెద్దాపురంలో శాంతి సువార్త ర్యాలీ నిర్వహిస్తున్న దైవజనులు

# నీట మునిగిన పంట భూములు

- ఇరిగేషన్, డ్రైన్ల అధికారుల సమన్వయ లోపం!
- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్న వ్యవసాయాధికారులు

సామర్లకోట: ఇరిగేషన్ శాఖ, డ్రైన్ల విభాగం అధికారుల సమన్వయ లోపం కారణంగా వీకే రాయపురం గ్రామానికి చెందిన రైతుల పంట భూములు నీట మునిగాయి. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు ఎగువ భాగం నుంచి పంట పొలాలకు నీరు చేరింది. ఈ క్రమంలో బుధవారం మండల వ్యవసాయాధికారి ఐ.సత్య వీకే రాయపురంలోని నీట మునిగిన పంటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నాలుగు ఎకరాల్లో వరి పంటకు చెందిన నర్సరీ, వెదజల్లు పద్ధతిలో నాట్లు వేసిన 24 ఎకరాలు నీటిలో మునిగినట్టు తెలిపారు.

ఇటీవల కురిసిన వర్షాలకు వేట్లపాలెం గ్రామం గోదావరి కాలువకు చెందిన సర్ ప్లస్ వైర్ల గేట్లు ఎత్తివేయడం వల్ల వీకే రాయపురం పొలాల్లోకి నీరు చేరిందని రైతులు ఇంటి వెంకట్రావు, వెలమర్తి శ్రీనివాసు ఆరోపించారు. దీనిపై ఇరిగేషన్ అధికారులు తాము గేట్లు ఎత్త లేదంటున్నారని, గేట్లు ఎత్తకుండా పొలాల్లోకి నీరు ఎలా వస్తుందని డ్రైన్ల అధికారులు చెబుతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏం చేయాలో తెలియక మండల వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేయడంతో, ఆమె ఆయా పంట భూములను పరిశీలించారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతామని ఆమె చెప్పారు.



వీకే రాయపురంలో నీట మునిగిన పంట భూములను ఏఓ సత్యకు చూపుతున్న రైతులు

# వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

- వేలాదిగా తిలకించిన భక్తులు
- ఘనంగా స్వామివారి గరుడవాహన సేవ



గరుడ వాహనంపై స్వామి అమ్మవార్లను ఊరేగిస్తున్న భక్తులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఉత్తరకంచిలో వేంచేసిన పద్మావతి అలువేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం బుధవారం కన్నుల పండువగా జరిగింది. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌కు అర్చకులు విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. కల్యాణ వేదికపై పద్మావతి అలువేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. మండలంలోని ఉత్తరకంచి, పెద్దిపాలెం, లంపకలోవ పరిసర గ్రామాల నుంచి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం గ్రామ పురవీధుల్లో గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. దారి పొడువునా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గురువారం సాయంత్రం స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



ఉత్తరకంచిలో స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపిస్తున్న పండితులు

# చేపల వేటతో ప్రజా ఆరోగ్యానికి ముప్పు

**– కమిషనర్‌కు కౌన్సిలర్ వినతిపత్రం**

సామర్లకోట: ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న చేపల వేటను వెంటనే నిలుపుదల చేయాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ నేతల హరిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరిబాబు విలేకర్లతో మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి చెరువుగా వినియోగిస్తున్న చెరువులో చేపల వేటకు అనుమతి ఇవ్వడం దారుణమన్నారు. దీని కారణంగా మున్సిపల్ కుళాయిల నుంచి కలుషిత జలాలు ప్రజలకు సరఫరా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కమిషనర్ రామారావు మాట్లాడుతూ ఈ చెరువుపై అధికారం మున్సిపాలిటీకి లేదని, పూర్తి అధికారాలు పబ్లిక్ హెల్త్ అధికారులకు మాత్రమే ఉన్నాయని చెప్పారు. అదే సమయంలో మున్సిపల్ కమిషనర్ వద్దకు పబ్లిక్ హెల్త్ ఈఈ హుస్సేన్ రావడంతో, చేపల వేటకు ఏవిధంగా అనుమతి ఇచ్చారని హరిబాబు ప్రశ్నించారు. తమ నుంచి చేపల వేటకు ఎటువంటి అనుమతులు లేవని ఆయన చెప్పడంతో, అధికార పార్టీ నాయకుల కుమ్మక్కుతో చేపల వేట జరుగుతున్నట్టు స్పష్టమవుతోందని హరిబాబు ఆరోపించారు. కలుషిత తాగునీరు కారణంగా అతిసార వ్యాధి వచ్చే అవకాశం ఉందని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ హరిబాబు

# చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి

**జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్**

ప్రత్తిపాడు: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని ఇచ్చే చిరుధాన్యాల సాగు చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులకు చిరుధాన్యాల సాగుపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ వ్యవసాయశాఖ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లావ్యాప్తంగా రాగి విత్తనాలు సబ్సిడీపై రైతులకు అందజేస్తున్నట్టు తెలిపారు. చిరుధాన్యాలను సాగు చేసే విధానాలను రైతు శిక్షణా కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ హరి వివరించారు. కార్యక్రమంలో జగ్గంపేట సహాయ వ్యవసాయ సంచాలకుడు ఇంటి వీర గంగాధర్‌కుమార్, ఏలేశ్వరం మండల వ్యవసాయాధికారి జ్యోతి, టెక్నికల్ వ్యవసాయాధికారి పద్మజ, రైతు శిక్షణా కేంద్రం వ్యవసాయాధికారి సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్

**చిరుధాన్యాల సాగుపై అవగాహన**

శంఖవరం: చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేలా కృషి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయ్‌కుమార్ వ్యవసాయ సిబ్బందికి సూచించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఏడీఏ ఎస్.బుల్లిబాబు ఆధ్వర్యంలో ఐదు మండలాల వ్యవసాయ సిబ్బందికి చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు ధాన్యాల సాగుతో రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చన్నారు. చిరు ధాన్యాల విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందిస్తోందన్నారు. చిరుధాన్యాల సాగుపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వనరులు కేంద్రం ఏడీఏ భ్రమరాంబ, వ్యవసాయాధికారులు ఈశ్వర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.